## క్లుప్తంగా

### ఆదిత్యుని సన్నిధిలో సఫాయి కార్మిక కమిషన్ సభ్యుడు



వావాకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జాతీయ సఫాయి కార్మికుల కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాదాచార్యులు, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి సాందీప్ శర్మ పాల్గొన్నారు.

### 28న ఆర్ట్స్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులతో ఈ నెల 28న సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మంగళవారం తెలిపారు. త్వరలో నాక్ పీర్ టీం సందర్శన ఉన్నందున మంచి గ్రేడ్ పొందే నిమిత్తం పూర్వ విద్యార్థుల సహకారాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పేరు, వివరాలను జీసీఎంఎస్‌కెఎల్ఎం.ఏసీ.ఇన్/అల్యూమిని-రిజిస్టర్.పీహెచ్‌పీ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 28న కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో జరిగే పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 9948121716, 9494944029 నంబర్లను సంప్రదించాలని కోరారు.


### అందుబాటులోకి విమానయానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒకప్పుడు విమానం చూడటమే గొప్పగా భావించే స్థితి నుంచి నేడు బస్సులమాదిరిగా ఫ్లైట్ జర్నీ అందుబాటులోకి రావడం గొప్ప విషయమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. హిస్టరీ, టూరిజం విభాగం, శ్రీకాకుళం జిల్లా ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో మంగళవారం 'ఫస్ట్ ఫ్లైట్ డే' వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త సురంగి మోహనరావు మాట్లాడుతూ భోగాపురంలో విమానాశ్రయం అందుబాటులోకి వస్తే జిల్లావాసులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ట్రావెల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నటుకుల మోహన్, సభ్యులు డాక్టర్ బడాన దేవభూషణరావు, పొన్నాడ రవికుమార్, ఎస్.ఎస్.ట్రావెల్స్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### సఫాయి కార్మికులకు డిస్లడ్జింగ్ వాహనాలు



వాహనాన్ని పరిశీలిస్తున్న పి.పి.వావా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులకు ఇటీవల అందజేసిన డిస్లడ్జింగ్ (సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు) వాహనాలను జాతీయ సఫాయి కార్మికుల కమిషన్ సభ్యుడు పి.పి.వావా బుధవారం పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ప్రత్యేక కిట్లు అందజేశారు. ప్రతి వాహనం రూ.31,67,326 విలువైనదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ పేర్కొన్నారు. రెండు గ్రూపులకు వాహనాలను అందజేశామని చెప్పారు. సంప్రదాయక వృత్తి నిర్వాహకుల జీవన ప్రమాణాలను, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ఈ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

# అగ్రిల్యాబ్ ప్రారంభానికి మోక్షమెప్పుడో?



అంపోలు పరిధిలో నిర్మించిన జిల్లా స్థాయి అగ్రిల్యాబ్

- గత ప్రభుత్వ హయాంలో రూ.3.68 కోట్లతో భవన నిర్మాణం
- జిల్లాస్థాయిలో సేవలందించేందుకు ఏర్పాటు
- పరికరాలు, సిబ్బంది నియామకంపై దృష్టి పెట్టని కూటమి సర్కారు

గార: జిల్లాలోని రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందించాలన్న ఉద్దేశంతో వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంతో పాటు జిల్లాస్థాయిలో ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో గార మండలం అంపోలు వద్ద జిల్లా స్థాయి అగ్రిల్యాబ్ నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ నిర్మాణ శాఖైన ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించి రూ.3.68 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణం చకచకా పూర్తి చేసింది. భవనాన్ని ప్రారంభించాలని సిద్ధమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో కార్యక్రమం నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం వచ్చాక వెనువెంటనే భవనం ప్రారంభించి పరికరాలు ఏర్పాటు చేసి సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. జిల్లాకు చెందిన టెక్కలి శాసనసభ్యుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నా ల్యాబ్‌పై దృష్టి సారించకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

**ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు..**

ప్రభుత్వం, ప్రైవేటు దుకాణాల్లో సరఫరా చేసే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారిక మందులు సరఫరా, అమ్మకాలు జరిగే వీటిని వ్యవసాయశాఖతో పాటు విజిలెన్సు అధికారులు ర్యాండమ్‌గా శాంపిల్స్ సేకరిస్తుంటారు. వీటితో పాటు రైతు తీసుకొచ్చిన నమూనాలను జిల్లా అగ్రిల్యాబ్‌లో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అధికారులు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని ల్యాబ్‌లకు పంపిస్తుండగా, రైతులు అంతదూరం శాంపిల్ తీసుకెళ్లినా ఫలితాలు ఆలస్యంగా రావడం, ప్రయాణ ఖర్చులు, సమయం వంటివి ఇబ్బందిగా పరిణమించాయి. జిల్లా అగ్రిల్యాబ్‌లో తనిఖీలో నకిలీవి అని తేలితే ఫెర్టిలైజేషన్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సీఓ) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ముందుగా ఆయా విత్తనాలను కిందిస్థాయిలోనే అమ్మకాలు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల నాణ్యమైన వాటినే విత్తే సమయంలో వేయవచ్చు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడిన తర్వాత తెలిసినా, అన్నదాతలకు సమయంతో పాటు డబ్బులు నష్టపోతారు. దీన్ని అధిగమించేందుకు జిల్లాలోనే నాణ్యమైన సేవలందేలా గత ప్రభుత్వం వీటికి రూపకల్పన చేసింది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సేవలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. ల్యాబ్‌కు డీడీ స్థాయి అధికారి, ముగ్గురు ఏడీ, ముగ్గురు ఏవోలు, పరీక్షలు జరిపే సిబ్బందిని నియామకం చేపట్టాల్సి ఉంది. పరికరాలు కొనుగోలుకు దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికై నా సర్కారు స్పందించి ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



మెట్ల మార్గం వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

### చొరవ తీసుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో రైతులకు నాణ్యమైన సేవలందించేందుకు అగ్రిల్యాబ్ నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలవుతున్నా ఇంతవరకు జిల్లాస్థాయి ల్యాబ్ ప్రారంభంపై ఆలోచన చేయకపోవడం తగదు. ఇప్పటికైనా స్పందించి జిల్లా అగ్రిల్యాబ్‌ను అధికారులు త్వరగా ప్రారంభించాలి.

– పీస శ్రీహరిరావు, కొర్లాం సర్పంచ్, గార మండలం

### చర్యలు చేపడతాం..



జిల్లా స్థాయి అగ్రిల్యాబ్‌కు రూ.2 కోట్లు విలువైన పరికరాలు రావాల్సి ఉంది. సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉంది. అప్పుడే రైతులకు సేవలు అందుతాయి. నిర్మాణ సంస్థకు కొంత బిల్లు అందాలి. మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం.

– త్రినాథస్వామి, వ్యవసాయ శాఖ జేడీ

## అలా వదిలేస్తున్నారు!



నగరంలోని రోడ్లపై పశువుల సంచారం ఎక్కువైంది. కొందరు యజమానులు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటల సమయంలో రోడ్లపైనే ఆవులు, గేదెలను వదిలేస్తున్నారు. పశువుల సంచారాన్ని నియంత్రించాలని సాక్షాత్తు కలెక్టర్ సైతం కార్పొరేషన్ అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

## అంతా అస్తవ్యస్తం



శ్రీకాకుళం నగరంలోని భారతీ నగర్, హడ్కోకాలనీకి అనుసంధానంగా ఉన్న కల్వర్టుపై పలకలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇక్కడ శివాలయం, భద్రమ్మ తల్లి, సాయిరాం మందిరం, ప్రభుత్వ మున్సిపల్ స్కూల్ ఉండటంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనచోదకులు పలకలు దాటలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

## తవ్వారు.. వదిలేశారు!



శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం రోడ్డు, రిమ్స్ హాస్పటల్ నుంచి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లే రోడ్డు, చిన్నబజారు రోడ్డులో మరమ్మతుల పేరిట గోతులు తవ్వి అలాగే వదిలేశారు. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. 20 రోజులైనా పనులు పూర్తి చేయలేదు. ఇప్పటికై నా అధికారులు చొరవ చూపి పనులు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

## సీజ్ చేశారు.. పక్కన పడేశారు



అధికారులు సీజ్ చేసిన రేషన్ బండిని శ్రీకాకుళం మండల తహశీల్దార్ కార్యాలయంలో వదిలేశారు. నెలల తరబడి పట్టించుకోకపోవడంతో బండి తుప్పుపట్టి పాడైపోతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎండీఓ ఆపరేటర్లు కోరుతున్నారు. – శ్రీకాకుళం రూరల్

# పెన్షనర్ల సంక్షేమానికి కృషి



శ్రీకాకుళం కల్చరల్: నకారా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పెన్షనర్లు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):మాట్లాడుతున్న విశ్రాంత జేసీ పి.రజనీకాంతరావు



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న డీపీటీఓ విజయ్‌కుమార్



జి.సిగడాం: విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం కల్చరల్: పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లా, పట్టణ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పింఛనుదారుల పితామహుడు ధరమ్ సింగ్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా శాఖ వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత తూతిక వీరభద్రస్వామిని స్మరిస్తూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ ఆర్ఎస్ ప్రకాశరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బి.మల్లేశ్వరరావు, సంఘ జిల్లా అధ్యక్షుడు కె.సోమసుందరరావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ప్రసాదరావు, సహాధ్యక్షులు పి.నర్సింహమూర్తి, ట్రెజరర్ కె.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు బి.జానకి రామ్‌పట్నాయిక్, ప్రధాన కార్యదర్శి నరసింహ పండా, కోశాధికారి కె.రామ్మోహన్‌రావు, వి.నాగేశ్వరరావు, ఆదినారాయణరావు, రామేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, నందికేశ్వరరావు, రవి, ప్రసాదరావు, గణపతిరావు, అన్నపూర్ణ, సత్యవతి, రాంబాయి, విజయ పాల్గొన్నారు.

☛ శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉద్యోగం నుంచి విరమణ చెందిన తరువాత పెన్షనర్లు గుర్తింపు లేకుండా ఉన్న సమయంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో అధికారంలోకి వచ్చా తగిన గుర్తింపు ఇచ్చారని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగ సంఘ నాయకులు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు భవనంలో విశ్రాంత జేసీ పి.రజనీకాంతరావు అధ్యక్షతన పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆర్.మోహనరావు, బాలసుబ్రహ్మణ్యం, ఆర్.గున్నయ్య, గరికివాడు, పి.జగన్మోహన్‌రావు, డి.పి.దేవ్, ఐ.టి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

☛ శ్రీకాకుళం అర్బన్: జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.పి.రావు అధ్యక్షతన పెన్షనర్స్ డే నిర్వహించారు. ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయకుమార్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ కింతలి కిరణ్‌కుమార్‌లు హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, ఎస్ఎస్ఆర్ శర్మ, జిల్లా నాయకులు సుమన్, రమేష్, జామి ప్రసాద్, ఎం.రామారావు, విశ్రాంత ఉద్యోగులు కె.నరసింగరావు, జి. ప్రసాద్, సత్యం, రాజు, జగన్నాథం, మోహన్‌రావు, దాస్, రామారావులను సన్మానించారు.

☛ జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో పెన్షనర్స్ డే సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు సాకేటి నాగరాజు, అల్లు జోగినాయుడు, తిరుమరెడ్డి వెంకటరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మీసాల వెంకటరమణ, కుమరాపు రవికుమార్, తోలేటి వెంకటరావు, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

☛ శ్రీకాకుళం అర్బన్: పెన్షన్ భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని ఏపీ సీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి భాస్కరరావు అన్నారు. శ్రీకాకుళం యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

### టార్పాలిన్లు సిద్ధం



టార్పాలిన్లను పరిశీలిస్తున్న తహశీల్దార్

గార: జిల్లాలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడిచిపోకుండా ఉంచేందుకు 100 టార్పాలిన్లను సిద్ధం చేశామని తహశీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. టార్పాలిన్‌కు రూ.650 చెల్లించి పట్టుకెళ్లి, వర్షాలు తగ్గాక తిరిగి అప్పగించి డబ్బులు పట్టుకెళ్లవచ్చని పేర్కొన్నారు. వర్షాలకు ధాన్యం తడచిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఒబెరాయ్

ఎచ్చెర్ల క్యాంపస్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు, ఉద్యోగాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మేజర్ ఎస్‌పీఎస్ ఒబెరాయ్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మంగళవారం సివిల్ సర్వీసెస్ పరీక్షలు, ఉద్యోగాల ఎంపికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ అర్హత ఆధారంగా దేశంలో అత్యుత్తమ ఉద్యోగాలు యూపీఎస్సీ పరీక్షల ద్వారా సాధించవచ్చన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీసులతో దేశానికి ఉత్తమ సేవలందించే అవకాశం లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సైతం సిలబస్, శిక్షణ వంటివి అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుతం సివిల్స్‌కు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**ఘనంగా కవితా దినోత్సవం**

శ్రీకాకుళం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త, శాంతినికేతన్ డైరెక్టర్ సురంగి మోహనరావు, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, వేమన కవితామయం అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన), కవి గుడిమెట్ల గోపాలకృష్ణ, కె.వి.రాజారావు, ఉమాకవి, కె. శ్రీనివాసరావు, సంతోష్, ఐఎన్‌డి ప్రసాదరావు, చోడవరపు ఈశ్వర్, ఉప్పు త్రినాదరావు, మజ్జి మోహనరావు, వాడాడ శ్రీనివాసరావు, జంధ్యాల శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**బాక్సింగ్ పోటీలకు పయనం**

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర స్థాయి సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలతో జిల్లాకు తిరిగిరావాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ నెల 19 నుంచి కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంగళవారం శ్రీకాకుళంలో అభినందించారు. క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న కోచ్‌ల సేవలను శ్రీనివాస్ కొనియాడారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, శాప్ వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ పాల్గొన్నారు.

**ధనుర్మాస మేలుకొలుపులు ప్రారంభం**



పాత శ్రీకాకుళంలో భజన బృందం



బలగ హరేరామ మందిరం భక్తబృందం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో పలుచోట్ల ధనుర్మాస మేలుకొలుపులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ధనుర్మాస మేలుకొలుపు భజన బృందం వేకువజామునే పలు భక్తిగీతాలను ఆలపించారు. భోగి పండుగ వరకు మేలుకొలుపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం తిరుప్పావై ప్రవచనాలలో భాగంగా గోదాదేవి పాశురాలపై ఉపన్యసించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. బలగలోని హరేరామ మందిరం ఆధ్వర్యంలో మేలుకొలుపు భక్త బృందం బొందిలీపురం పురవీధులలో మేలు కొలుపు గీతాలు, భజనలు చేశారు.

**రైతులు అప్రమత్తంగా ఉండాలి**

జి.సిగడాం: జిల్లాలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి యర్రా శారద సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కోతలు కోసి ఓవులు ఉంటే వెంటనే కుప్పలు వేసి భద్రపరుచుకోవాలన్నారు. ఆరుబయట ఉంచిన ధాన్యం బస్తాలను షెల్టర్స్‌లో పెట్టుకోవాలని సూచించారు.

**పాలఖండ్యాంలో విచారణ**

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం మంగమ్మ పనితీరుపై సర్పంచ్ ధారబోయిన రెయ్యమ్మ, ధర్మారాజ్ ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం హెల్త్ కేంద్రం వద్ద డీపీఎంఓ వెంకటలక్ష్మి, మోహిని విచారణ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ పేకల సుమబిందు, సూపర్‌వైజర్ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి గౌరీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా సెమీ క్రిస్మస్ సంబరాలు



కల్వరీ ప్రేయర్ టెంపుల్‌లో హ్యాపీ క్రిస్మస్ వేడుకలు



దుస్తులు అందజేస్తున్న బిషప్ జాషువా



అప్పర్ రూం చర్చి వద్ద ప్రార్థనలు



గారలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్/గార: పాత్రునివలసలోని కల్వరీ ప్రేయర్ టెంపుల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో స్తుతి ఆరాధన, స్కిట్స్, క్రిస్మస్ సందేశం, చిన్న పిల్లల పాటలు, నృత్య ప్రదర్శనలు జరిగాయి. కల్వరీ క్వయిర్ బృందం గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో చల్లా విజయ్, సౌమ్య, కె.సూర్యనారాయణ, చల్లా ఎస్తేరురాణి, భార్గవ్, ప్రసన్న, కాలెబు, కొర్నేలు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అప్పర్ రూం చర్చి పాస్టర్ కె.సుజ్ఞానరావు, కె.వెస్లీ సుజ్ఞాన్ క్రీస్తు సందేశం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గార మండల కేంద్రంలోని సంతతోట సమీపంలో ఏసుక్రీస్తు మహిమ మందిరంలో మహిళా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బిషప్ వి.జాషువా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వి.సత్య, డి. గీతాంజలి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఎల్.ప్రిస్కిల్లా గిరిరాజ్ , సీహెచ్. జెస్సీ మెటిల్డా ప్రార్థనా గీతాలు ఆలపించారు. అనంతరం క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్ నిర్వహించారు. మహిళలతో పాటు వంద మందికి వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఉషారాణి, హర్ష, జార్జి ముల్లర్ తదితరులు పాల్గొన్నారు.